# మాలో వచ్చిన మార్పు

శ్రీ సి. సి. పున్నయ్య



అప్పట్లో రాణి నన్ను అంతగా ఆకర్షించడానికి ఆమె యవ్వనము కారణము కాదు. అప్పుడామెకు మహా యుంటే 11 సంవత్సరాల వయస్సుంటుదేమో! జాకెట్టుకు సరిగ్గా గుండీలయినా పెట్టుకోకుండా రేగిన ముంగురులు గాలికి ముఖముమీద చిందులు త్రొక్కుతూ "బావా! బావా!" అంటూ నా వెంబడి తిరుగుతుంటే దేవకన్యలాగుండేది. ఆమె పెంకెతనాన్ని మరుగుపరచే అమాయికపు చూపులు కొంటెతనము నన్ను ఆకర్షింపజేశాయి - ఆకర్షించడమేమిటి! - ఆమెనుగిచ్చియో, ఏదో పేరుపెట్టి పిలిచియో ఆమెచేత తిట్లుతినడం, ఒక్కొక్కప్పుడు ఆమె కొట్టడం, గిచ్చడం, కొరకడం పరిపాటిగానుండేది. ఆ గాట్లు యీ నాటికింకా గతాన్ని స్ఫురణకు తెస్తూ నన్ను పిచ్చివాణ్ణి చేస్తుంటవి. పండువెన్నెలను మరపించే ఆమె శరీరచ్ఛాయ, దొండపండులాంటి పెదవులతో గాలిపటంలాగ తిరుగుతుంటే ఆమెలోగల వ్యక్తిత్వపు ప్రత్యేకతను నేనొక్కణ్ణే గుర్తించి ఆరాధిస్తున్నాననుకునేవాడిని.

ఆ పిల్ల మా మామ కుమార్తె. కలరాలో తల్లిదండ్రులిద్దరు యించుమించుగా ఒక్కసారే చనిపోయారు. రాణి మా యింట్లోనే పెరిగి పెద్దదయింది.

ఊహాపోహాలు రాణివి మహాగొప్పవి. దాంతోపాటు పట్టుదల, పెంకెతనము పుట్టుకతోనే అబ్బినవి. ఒక క్షణంలో మనసు ఎంతకఠినమయిందో మరొక క్షణంలో అంత నవనీతమయిపోయేది. ఆమె రచ్చ ఒక్కొక్కప్పుడు నాకు ఎంతో చీకాకు కలిగించేది. కాని వెంబడే పరుగెత్తుకుంటూవచ్చి కళ్లల్లో కళ్లు పెడ్తూ "బావకు కోపమువచ్చినట్లుందే!- యింత

కోపమయితే ఎలాగచెప్పు! - ఇదుగో చూడు - అత్తయ్య నాకు అణా యిచ్చింది. దానికి శనగపప్పు కొనుక్కొచ్చి, అందులో ఉప్పుకారంకలిపి నెయ్యి వేసి నిమ్మకాయ రసంపిండి తెచ్చేదా" అని గుక్క త్రిప్పుకోకుండా నేను 'ఊఁ' అనేదాక వేధించేది. ఇంట్లో గోంగూర పచ్చడికాని, చింతపండు పచ్చడి కాని చేశారంటే అమ్మ చూచి కొంత, చూడక కొంత దుత్తలోని వెన్నలో చాల భాగం నా కంచములో వేసేది. ఇంట్లో ఏపిండివంటచేసినా అందరికంటె ముందు నాకు తెచ్చిపెట్టి నాతోపాటు తనూ తినేది. మా యింట్లో వేరే ఆడపిల్లలు లేకపోవడంవలన మా అమ్మ, నాన్నకూడ రాణిని చాల గారాబంగా చూచేవారు. అన్నం దగ్గర పాలు, పెరుగు, వెన్న త్రాగినంత, తిన్నంత నాకువేసి రాణి తనుతిని ఆగడం చేస్తుంటే మా అమ్మ "ఇప్పుడే మీ రిద్దరు ఏకమై నాఅంతుకనుక్కుంటున్నారు: యిక ముందు ముందు మరీ ఎట్లాగుంటుందో" అని ఘురుసుకునేది.

మా తమ్ముడు వయస్సులో నాకంటె రెండు సంవత్సరాలుచిన్న. నేను ఇంటర్మీడిఏటు చదువుతుండగా స్కూలుఫైనలు చదువుతుండేవాడు. ఇంటర్మీడిఏటు పరీక్షాఫలితాలు ప్రకటించగానే మా ఆమ్మ నాన్నతో "ఏమండీ! పిల్ల, పిల్లవాడు మన యింట్లోనే యున్నారాయె - యీ సెలవుల్లో మూడుముళ్లుపడితే బాగుంటుంది" అన్నది.

"బాగానేయుంది - చంద్రుడితో చెప్పిచూడు ఏమంటాడో."

◆ ◆ ◆

"రాణీ! మన యిద్దరికీ త్వరలో పెళ్లి కాబోతున్నది తెలుసా!" అన్నాను.

ఆ మాటలు రాణి ముఖచిహ్నాలలో ఎట్టిమార్పు తేలేదు.

"ఏమిటి - మాట్లాడవెందుకూ? - నీ కిష్టంలేదా? అలాగైతే పోనీలే" అన్నాను.

"ఇంతలో మునిగిపోయిందేమిటిబావా! నా స్కూలుఫైనలు పూర్తికానియ్యి" అంది రాణి.

మరల కాలేజీలు తెరిచే రోజులు సమీపించినవి. నన్ను బి. ఎ., లా చదువుకు మద్రాసుకు పంపడానికి మానాన్న నిశ్చయించాడు. కాని రాణికి, నాకు ఏర్పడనున్న ఎడబాటు నాలో మితిలేని బెంగకు కారణమయింది. రాణీ నాతోలేని క్షణాన్ని యుగంగాగడిపే నాకు ఒంటరిగా మద్రాసులో ఏలా కాలం గడుస్తుందా అనేది పెద్ద సమస్య అయింది. నేను మద్రాసుకు పోబోతున్నానని తెలిసి రాణి పరుగెత్తుకుంటూవచ్చి "బావా! నీవు మాత్రం మద్రాసు కెళ్లి హలాసాగా జీవితం గడుపబోతున్నావు; మరి నేనిక్కడ బిక్కుబిక్కుమంటూ..." అన్నది చెమ్మగిలిన కండ్లతో తలవంచుకొని.

"అయితే వెళ్లవద్దంటావా రాణీ! - చదువు పూర్తికాగానే వచ్చేస్తానుకదా! యీ లోపల ఎన్నిసార్లు వస్తుంటాను,పోతుంటాను!" అన్నాను ఆమె చేతులను నాచేతుల్లోకి తీసికొని.

"ఏమో బావా! నీవులేని యీ యింట్లో సర్వము శూన్యము కానున్న దేమోననిపిస్తున్నది. సంవత్సరాలు తరబడి నీవు నాకు దూరమైపోతావుకదూ!" అన్నది పొంగిపొరలే దుఃఖంతో.

"పిచ్చిపిల్లా! రోజు లెంతలో దొర్లిపోతవి! నేను మాత్రం నిన్ను విడిచి ఎంతకాలముండగలను! అమ్మ, నాన్నలను విసిగించకుండాయుండు" అని ఓదారుస్తూ రాణి కండ్ల నీళ్లనుచేతిగుడ్డతో తుడిచాను. తర్వాత నాలుగు రోజులకు మద్రాసుకు ప్రయాణమై వెళ్ళిపోయాను.

లా పరీక్షలు జరుగడానికి పది పదిహేను రోజులున్న సమయము. దూరాభారమయినా అంతవరకు ప్రతిశలవుల్లోను యింటికి వెళ్ళి వస్తూనే యున్నాను. రాణి దగ్గరనుండి తరచుగా జాబులు రావడం, నేను వ్రాయడం జరుగుతుండేది.

పరీక్షరోజులు సమీపిస్తున్నకొద్దీ దీక్షగా చదువుతున్నాను. ఒక రోజున మా నాన్నదగ్గరనుండి 'రాణికి స్ఫోటకంపోసి ప్రమాదావస్థలోనున్నది' అని టెలిగ్రాం వచ్చింది. పరీక్షల హడావుడిలో నేను వెంటనే బయలుదేరిపోలేక నా ఆదుర్దాను తెలియ జేస్తూ రాణికి అవసరమైన వైద్యసదుపాయాలనుచేసి జాగ్రతగా చూడవలసిందిగా యింటికి జాబువ్రాశాను. వారంరోజులకు ఆమె ఆరోగ్యము నెమ్మదిగానున్నట్లు జాబువచ్చింది.

పరీక్షలు అయిపోయి శలవులిచ్చారు. ఎప్పుడెపుడు ఊరికిచేరి రాణిని చూద్దామా అనే ఆదుర్దాతో రైలెక్కి కూర్చున్నాను. బండిలో ప్రయాణముచేసినంతసేపు రాణి ఆరోగ్యాన్ని గురించి, ఆమె రూపంలో స్ఫోటకం ఫలితంగా ఏర్పడిన మార్పులను గురించి - ఆమెయొక్క ప్రేమానురాగాలను, చిన్ననాటి పెరికెతనాన్ని తలచుకుంటూ, దారిలోని స్టేషనులలో బండి ఆగినప్పుడల్లా యింకా నాగమ్యస్థానం రాలేదని కసురుకుంటూ రాత్రల్లా కన్నుమూయకుండా గడిపాను. ఉదయం 6 గంటలయ్యేసరికి నేను దిగాల్సిన స్టేషను రానేవచ్చింది. దిగి యింటిముఖం పట్టాను.

ఇంటిగడపలో కాలుపెట్టీ పెట్టకముందే చేతిలోని బెడ్డింగును పరుగెత్తుకొనివచ్చి అందుకొనే రాణి కనుపించకపోవడం నన్ను కొంత కలవరపరచింది. మా అమ్మ కాళ్ళకు నీళ్లుతెచ్చియిచ్చి, కాఫీ తెచ్చియివ్వడానికి యింట్లోకి వెళ్ళింది.

కాళ్లుకడుక్కొని తుడుచుకుంటూ మా అమ్మ చేతిలోని కాఫీగ్లాసు అందుకొని హాలులోని సోఫాలో కూర్చొని-

"రాణి ఏదమ్మా! కనుపించలేదు" అన్నాను.

"ఇంట్లోనే ఏమూలనో యున్నది; పద స్నానం చేద్దువుగాని" అంది.

స్నానంచేసి భోజనానికి కూర్చున్నాను. కాని ఎప్పటిలాగ రాణి నా ప్రక్కన లేకపోవడం కొరతగానే యుండింది. ఏదో నాలుగు మెతుకులుతిని లేచి వెళ్ళాను.

రాణి ఎక్కడయుందా అని యిల్లంతా గాలించ మొదలుపెట్టాను. లోపలగదిలో పేముకుర్చీలో కూర్చొని ఏదో చదువుకొనుచుండుటను చూచాను. నేను వచ్చానని తెలిసికూడ రాణి ఏమిఎరుగనిదానిలాగ నుండటం నాకాశ్చర్యము కలిగించింది. మెల్లగా గదిలోకి ప్రవేశించి రాణిని సమీపించాను.

ఆ! _ రాణి రూపంలోని లావణ్యమేమైంది! అబ్బ ముఖుమిూద పెద్దపెద్ద మచ్చలు, దేహమంతా నల్లకప్పేసి వికృతంగా రూపొందింది. అది చూచి నా కళ్లకు కారుచీకట్లు క్రమ్మినవి - మనసు పరిపరివిధాల పోయింది. ఆమె బాహ్య సౌందర్యం దెబ్బతిన్న మాట నిజమే; దానికి ఆమె ఎలాగ బాధ్యురాలు! ఆమె హృదయ సౌందర్యము మాత్రము చెక్కుచెదరి యుండదని నిర్ధారణచేసికున్నాను.

"రాణీ! నీ సౌందర్యము మాసిపోయిందని విచారపడుతున్నావుకదూ! దానికంటె నీ ప్రేమానురాగ పూరితమయిన హృదయ సౌందర్యాన్నే ఎక్కువగా ప్రేమించాను - ఆరాధించాను. నీకు నా హృదయంలోగల స్థానానికి ఎన్నటికీ చలనంలేదు" అన్నాను సమీపంలోనున్న కుర్చీకి ఆనుకుంటూ.

రాణి తలవంచుకునే ఆ మాటలు విన్నది.

వారంరోజులు గడిచినవి. ఒక రోజున ఎక్కడనుండియో రాణికి జాబువచ్చింది. దాన్ని తీసికొని వెళ్ళి చింపిచదువడం ప్రారంభించింది. వెనుకనే నేను పోయి గదిగుమ్మం దగ్గర నిలబడిచూస్తూ నిలబడ్డాను. జాబు చదువుతూ, చదువుతూ వెక్కి వెక్కి ఏడ్వ సాగింది. నేనది చూచి అప్పటికి వెనక్కు తప్పుకున్నాను.

గంటసేపయిన తర్వాత గదిలోకివెళ్ళిచూచాను. రాణి ముఖమునిండా గుడ్డకప్పుకొని నిద్రపోతున్నది. టేబిలుదగ్గర వచ్చిన ఉత్తరం చిన్నచిన్న ముక్కలుగా చించిపారేసియుంది. మెల్లగా దగ్గరకువెళ్ళి రాణిని తట్టిలేపాను. ఏదో కలవరపడ్డట్లు లేచి దూరంగా నిలబడింది. ఎర్రబడియున్న కళ్ళనుచూచి "ఏంరాణీ! కళ్లు ఎర్రబడియున్నవి - ఒంట్లో కులాసాగాలేదా" అన్నాను.

"లేదు బావా! నేనొక విషయం నీతో చెప్తాను- క్షమిస్తానని ప్రమాణంచెయ్యి" అన్నది ప్రాధేయపడ్తూ.

"అదేమిటి రాణీ! - క్షమించడం! - ఏమిటో చెప్పదలచుకున్నదిచెప్పు" అన్నాను సమీపమునవున్న కుర్చీలో కూర్చుంటూ.

"నేను నీ ప్రేమకు అర్హురాలనుకాను. నామీద ఆశవదలిపెట్టు. నీప్రేమానురాగాలు గాఢమయినవి, పవిత్రమయినవని నాకు తెలిసీకూడ నిన్ను నేనింత కాలము ప్రియుడుగా ప్రేమించి ఆరాధించలేకపోయిన నిర్భాగ్యురాలను" అంటూ వెక్కి వెక్కి ఏడ్వసాగింది. నాకంతా అయోమయమయింది.

"అంటే..." అన్నాను అప్రయత్నంగా.

"ఇంతకాలము నీకు యియ్యని స్థానమును చిన్నబావకు నా హృదయంలో యిచ్చాను. అతడూ నన్నింతవరకు గాఢంగానే ప్రేమించాడు. కాని స్ఫోటకం ఫలితంగా నేననాకారినైనానని నన్ను తృణీకరిస్తూ వ్రాసినదే యీ జాబు." అంటూ చించిపారవేసి యున్న జాబుముక్కలను చూపింది.

"నీకు ద్రోహంచేశానని అంతర్వాణి ఘోషిస్తూనే యుంది. దానికి భగవంతుడు తగిన శాస్తి చేశాడు నాకు. ఈ సమయంలో నీకు చేసినద్రోహం కాక, నా దృష్టిని నీవైపుకు మరల్చునట్టి నీచురాలను కావడం నాకిష్టంలేదు. నీవు మరొక యువతిని వివాహమాడి సుఖపడ్తుంటే చూచి ఆనందించాలనే నా ఆశ"

నాకు ఆశ్చర్యంకలిగింది. దాంతోపాటుకోపం కూడవచ్చింది. కాని నేను ప్రేమించి, ఆరాధించిన మూర్తి నన్ను ప్రేమించి, స్వీకరించ నుద్దేశించనప్పుడు నేను ఆవేదనపడిమాత్రం లాభమేమిటి?

అప్పటినుండి రాణితో నామాటలు, సంబంధము పరిమితమయి పోయినవి. ఆమె నేను యిప్పుడు సోదరీ, సోదర తుల్యులము. నాకు వివాహమయింది. రాణి మాత్రం యావజ్జీవపర్యంతము అవివాహితగానుండ నిశ్చయించుకున్నది. ఆమె మాయింట్లోనేయుండి మాతో బాటు సర్వహక్కులు, అవకాశాలు అనుభవిస్తూ మాతో బుట్టవులలో, ఒకతె అయిపోయింది. మాలోవచ్చిన మార్పుకు కారణమును యీ నాడు, ఆనాడు, యికముందు కూడ మా తల్లి తండ్రులు తెలిసికోలేదు.

పాత్రుడు గారి

బాలసంజీవిని (Regd)

పిల్లల లివర్ అండ్ స్ప్లీన్ వ్యాధులను నివారించును

డాక్టరు పిల్లా పాపయ్య పాత్రుడు అండ్ బ్రదర్స్,

19, దక్షిణ మాడవీధి, మైలాపూరు, మదరాసు-4. Phone 85254.

కుంభకోణము బ్రాంచి: 1. సారంగపాణి కోవిల, తూర్పువీధి.

అన్ని మందుల షాపులలోను దొరకును.